TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 91 | మంగళవారం, జూలై 30, 2024 | కాంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి...

## సీఎం రేవంత్ రెడ్డికి మాదిగ ఎమ్మెల్యేల వినతి



హైదరాబాద్: మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ ఎమ్మెల్యేలు వినతి పత్రం సమర్పించారు. అసెంబ్లీ టీ బ్రేక్ సమయంలో అడ్లూరి లక్ష్మణ్, కవంపల్లి సత్యనారాయణ, మందుల సామ్యేల్, లక్ష్మీ కాంతారావు, వేముల వీరేశం.. సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. తెలంగాణలో అతిపెద్ద సామాజిక వర్గమైన తమ కమ్యూనిటీకి అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వంలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని ఆ సామాజిక వర్గ నేతలు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. జనాభా పరంగా గణనీయ సంఖ్యలో ఉన్న తమకు కేబినెట్‌లో చోటు ఇవ్వాలని కోరుతున్నారు.

### నీట్ యూజీ కౌన్సిలింగ్ తేదీలు ఖరారు..


## ఆగస్టు 14 నుంచే




ఢిల్లీ: నీట్ యూజీ కౌన్సిలింగ్‌పై కేంద్రం కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. కేంద్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలోని మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఆగస్టు14 నుంచి నీట్ యూజీ కౌన్సిలింగ్ నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కౌన్సెలింగ్ కి సంబంధించిన షెడ్యూల్, అప్‌డేట్ తదితర వివరాల కోసం.. మెడికల్ కౌన్సిల్ వెబ్‌సైట్ ఎప్పటికప్పుడు చూడాలని విద్యార్థులకు కేంద్రం సూచించింది. ఈ మేరకు నీట్ అభ్యర్థులకు కేంద్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ నోటీస్ రిలీజ్ చేసింది. ఆగస్టు మొదటి వారంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నీట్ యూజీ 2024 పరీక్షలో 50 శాతం మార్కులు పొందిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి అర్హులు. అయితే రిజర్వ్‌డ్ కేటగిరీకి చెందిన అభ్యర్థులు ఉత్తీర్ణత శాతంలో సడలింపు పొందుతారు. దివ్యాంగులు 40 శాతం, రిజర్వ్ చేయని దివ్యాంగులు అర్హత సాధించడానికి 45 శాతం అవసరం. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ 15 శాతం ఆల్ ఇండియా కోటా సీట్లు డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్శిటీలు, ESIC, AFMC, BHU, AMU సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తుంది.

## నన్ను అట్లా పిలవొద్దు!

న్యూఢిల్లీ: రాజ్యసభలో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్, జయా భాధూరిని ఉద్దేశించి 'జయా అమితాబ్ బచ్చన్' అని సంబోధించారు. దానికామె తనని అలా పిలవొద్దని అన్నారు. తనని జయా బచ్చన్ అని పిలిస్తే సరిపోయేదన్నారు. దానికి హరివంశ్ నారాయణ్ స్పందిస్తూ... ఇక్కడ పూర్తిపేరు రాసి ఉన్నందునే అలా పిలవాల్సి వచ్చిందన్నారు. దానికి జయా బచ్చన్ అసహనాన్ని చాటుతూ 'మహిళలను భర్త పేరుతో మాత్రమే గుర్తిస్తారా? వారికంటూ స్వంత ఉనికి ఉండదా? స్వంతంగా విజయాలు సాధించడం లేదా?..." అంటూ నిప్పులు చెరిగారు. ఒకప్పుడు నటి అయిన జయా బచ్చన్ తర్వాత రాజకీయాలలోకి వెళ్లారు. సమాజ్ వాదీ పార్టీ నుంచి ఐదు సార్లు రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. మహిళల హక్కులపై ఎప్పుడూ పార్లమెంటులో గళం విప్పుతుంటారు.



### సివిల్ విద్యార్థుల మృతి..

## దర్యాప్తు కమిటీని నియమించిన కేంద్రం

ఢిల్లీ: సెంట్రల్ ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్ ఐఏఎస్ స్టడీ సెంటర్‌లో వరదనీరు పోటెత్తి ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై కేంద్రం సోమవారంనాడు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఒక కమిటీని కేంద్ర హెూం శాఖ నియమించింది. ఘటనకు దారితీసిన కారణాలు, బాధ్యులను గుర్తించడం, చర్యలు సూచించడం, పాలసీ మార్పులను సిఫారసు చేయడం వంటి బాధ్యతలను కమిటీకి అప్పగించినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఎంహెచ్ఏ ప్రతినిధి తెలిపారు. కేంద్ర కమిటీలో అడిషనల్ సెక్రటరీ ఎంఓయూహెచ్ఏ, ప్రిన్సిపల్ సెక్రటరీ (హెూమ్), ఢిల్లీ గవర్నమెంట్, స్పెషల్ సీపీ, ఢిల్లీ పోలీస్, ఫైర్ అడ్వయిజర్, జేఎస్, ఎంహెచ్ఓ కన్వీనర్‌గా ఉంటారు. 30 రోజుల్లోగా కమిటీ నివేదిక అందిస్తుందని హెూం మంత్రిత్వ శాఖ తెలిపింది.




### కేజ్రీవాల్ బెయిల్ పై...

## తీర్పు రిజర్వ్



న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సోమవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై మొదట విచారణ ట్రయల్ కోర్టులో జరగాలని సీబీఐ తెలిపింది. కేజ్రీవాల్ సహా ఆరుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు హైకోర్టుకు సీబీఐ తెలిపింది. కేసు దర్యాప్తును కేజ్రీవాల్ ప్రభావితం చేస్తున్నారని.. కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత అనేక ఆధారాలు వెలుగులోకి వచ్చాయని సమగ్ర దర్యాప్తు జరిపి చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు న్యాయస్థానానికి సీబీఐ తెలిపింది. ఇదిలా ఉంటే లిక్కర్ పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో కేజ్రీవాల్‌కి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని.. రికవరీ కూడా లేదని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలిపారు. లిక్కర్ పాలసీ ఆమోదంపై కేజ్రీవాల్‌తో పాటు ఢిల్లీ ఎల్జీ సహా 15 మంది సంతకం చేశారని వారిని ఎందుకు నిందితులుగా సీబీఐ చేర్చలేదని సింఘ్వి ప్రశ్నించారు. సీబీఐ కేసులో కేజ్రీవాల్ సూత్రధారి అంటున్నారని.. కానీ ఆయనకు వ్యతిరేకంగా ఆధారాలు లేవన్నారు. విజయ్ నాయర్‌కి సీబీఐ కేసులో బెయిల్ వచ్చిందని, కేజ్రీవాల్‌కు కూడా బెయిల్ ఇవ్వాలని అభిషేక్ సింఘ్వి కోర్టును కోరారు. ఇరువాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసినట్లు ప్రకటించింది.

### సభకు రానప్పుడు కెసిఆర్‌కు ప్రతిపక్ష

## హెూదా ఎందుకు?

### :రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్: తెలంగాణ విభజన సమయంలో అధిక విద్యుత్‌ను మన రాష్ట్రానికి యుపిఎ ప్రభుత్వం కేటాయించిందని కాంగ్రెస్ ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా ఎంఎల్ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన కాకుండా అవసరాల మేరకు విద్యుత్‌ను కేటాయించాలన్నారు. విద్యుత్ అవకతవకలపై కమిషన్ వేసి దర్యాప్తు చేస్తున్నామని, బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సభకు వచ్చి మాట్లాడాలని కోరుతున్నామని, కెసిఆర్ సభకు ఎందుకు రావట్లేదని అడిగితే కెసిఆర్‌తో మాట్లాడే స్థాయి మాది కాదనడం సరికాదన్నారు. సభకు రానప్పుడు కెసిఆర్‌కు ప్రతిపక్ష హెూదా ఎందుకు అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హెూదా కెసిఆర్ కాకుండా వేరేవారు తీసుకోవచ్చుకదా? అని రాజగోపాల్ రెడ్డి చురకలంటించారు.

## దేశంలో భయానక వాతావరణం ఉంది: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: బడ్జెట్ సెషన్ రెండో వారం సమావేశాలలో నేడు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కేంద్ర బడ్జెట్ 2024పై లోక్ సభలో మాట్లాడుతూ "దేశంలో భయానక వాతావరణం ఉంది" అన్నారు. అంతేకాక "దేశంలో పెద్ద పారిశ్రామిక వ్యాపారవేత్తలను ప్రోత్సహించి గుత్తాధిపత్యం కట్టబెడుతున్నారు. ట్యాక్స్ టెర్రరిజం అంశాన్ని బడ్జెట్ అసలు స్పృశించనే లేదు. చిన్న వ్యాపారాలకు గడ్డు పరిస్థితులు సృష్టిస్తున్నారు. కమలం తాలూకు చక్రవ్యూహాన్ని రచించి భారత్ ను అందులో చిక్కుకునేలా చేశారు" అన్నారు.

### జైపాల్ రెడ్డి కృషితోనే 54 శాతం...

## విద్యుత్ తెలంగాణకు

హైదరాబాద్: విద్యుత్ వినియోగం ప్రాతిపదికనే విద్యుత్ విభజన జరిగేలా దివంగత కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. విభజన చట్టంలో లేని స్పీకింగ్ ఆర్డర్‌ను విద్యుత్ విషయంలో 54 శాతం తెలంగాణకు వచ్చేలా జైపాల్‌రెడ్డి కృషి చేశారని కొనియాడారు. శాసన సభలో పద్దులపై చర్చ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం 36 శాతం తెలంగాణలో, 64 శాతం ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. విభజన చట్టంలో తెలంగాణకు 36 శాతం, ఎపికి 64 శాతం విద్యుత్ వచ్చేలా ఉందన్నారు. తెలంగాణను చీకట్ల నుంచి కాపాడింది జైపాల్ రెడ్డి అని కొనియాడారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ దయ, జైపాల్ రెడ్డి కృషి వల్ల విద్యుత్ సమస్య నుంచి తెలంగాణ గట్టెక్కిందని గుర్తు చేశారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు, యాదాద్రి పవర్ ప్లాంట్‌పై న్యాయవిచారణ జరుగుతోందని, విచారణ కమిషన్ ముందు వాదనలు వినిపిస్తే బిఆర్ఎస్ సభ్యుల నిజాయితీ బయటకు వచ్చేదని, న్యాయ విచారణ కోరిందీ వాళ్లేనని, ఇప్పుడు వద్దంటున్నది వాళ్లేనని దుయ్యబట్టారు. విద్యుత్‌పై విచారణ కొనసాగించాలని సుప్రీం కోర్టు కూడా చెప్పిందని, విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్‌ను సోమవారం సాయంత్రం నియమిస్తామని స్పష్టం చేశారు. విచారణలో వీళ్ల అవినీతి బయటకు వస్తుందని అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు.



# అగ్నిపథ్ పథకంపై రాహుల్ గాంధీ, రాజ్‌నాథ్ సింగ్ లోక్‌సభలో వాగ్వాదం

న్యూఢిల్లీ: ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శించిన అగ్నిపథ్ పథకంపై సోమవారం ఇక్కడ లోక్‌సభలో కాంగ్రెస్‌కు చెందిన రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య వాడీవేడీ చర్చ జరిగింది. ఈ అంశంపై ప్రతిపక్ష నేత తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి ప్రజలను




తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి ఆరోపిస్తూ, ఈ అంశంపై సభలో చర్చిస్తామన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్‌పై తన ప్రసంగంలో, శ్రీ గాంధీ అగ్నిపథ్ పథకం దేశంలోని సైనికులు మరియు వారి కుటుంబాల ఆర్థిక భద్రత మరియు గౌరవాన్ని దోచుకున్నారని, పెన్షన్ లేకపోవడాన్ని ఎత్తి చూపారని పేర్కొన్నారు. ఈ పథకం ప్రభుత్వ 'యువత, రైతు వ్యతిరేక' ధోరణిని బట్టబయలు చేస్తుందని ఆరోపించారు. బడ్జెట్‌పై గాంధీ అనేక అపోహలను ప్రచారం చేశారని, ఆర్థిక మంత్రి సీతారామన్ తన రాబోయే ప్రసంగంలో దీనిపై స్పష్టత ఇస్తారని సింగ్ వాదించారు. మిస్టర్ గాంధీ, అగ్నిపథ్ గురించి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, దీనివల్ల ప్రతిపక్ష నాయకుడు తన మడమల్లో తవ్వుతున్నాడని ఆయన అన్నారు. జూలై 1న, శ్రీ గాంధీ మరియు రక్షణ మంత్రి మధ్య లోక్‌సభలో ఇదే విధమైన వేడి చర్చ జరిగింది. "ఒక అగ్నివీర్ మందుపాతర పేలుడులో ప్రాణాలు కోల్పోయాడు, కానీ అతను 'అమరవీరుడు'గా గుర్తించబడలేదు. నేను అతన్ని అమరవీరునిగా భావిస్తున్నాను, కానీ భారత ప్రభుత్వం అలా చేయదు. %ూవీ% మోడీ అతన్ని అమరవీరుడు అని పిలవలేదు ు అతను అతనిని సూచిస్తాడు. ఒక అగ్నివీరుడుగా అతని కుటుంబానికి పెన్షన్ లేదా పరిహారం అందదు.

గాంధీ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని సింగ్ వాదించారు మరియు విధి నిర్వహణలో మరణించిన అగ్నివీరుల కుటుంబాలకు రూ.1 కోటి ఆర్థిక సహాయం అందుతుందని స్పష్టం చేశారు. "అతను (రాహుల్ గాంధీ) తప్పుడు ప్రకటనలతో సభను తప్పుదారి పట్టించకూడదు. మన సరిహద్దులను రక్షించే సమయంలో లేదా యుద్ధ సమయంలో తన ప్రాణాలను అర్పించే అగ్నివీరుడి కుటుంబానికి 1 కోటి ఆర్థిక సహాయం అందించబడుతుంది," అని %వీతీ% సింగ్ నొక్కిచెప్పారు. మిస్టర్ గాంధీ తరువాత విధి నిర్వహణలో మరణించిన అగ్నివీర్ అజయ్ కుమార్ కేసును ఉదహరించారు మరియు తండ్రి వీడియోను పోస్ట్ చేశారు, కుటుంబానికి కేంద్ర ప్రభుత్వం నుండి ఎటువంటి డబ్బు రాలేదని మరియు సౌకర్యాలు మరియు పెన్షన్ డిమాండ్ చేశారు. అజయ్ కుమార్ కుటుంబం తమకు కొంత పరిహారం అందిందని, అయితే అతనికి హీరో హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. "అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని, మాకు పెన్షన్ మరియు క్యాంటీన్ కార్డు ఇవ్వాలని మేము కోరుకుంటున్నాము" అని అతని తండ్రి చెప్పాడు. 2022లో ప్రారంభించబడిన అగ్నిపత్ పథకం సాయుధ దళాలలో స్వల్పకాలిక సేవ కోసం సిబ్బందిని నియమించడానికి మరియు బోర్డు అంతటా అభ్యర్థుల వయస్సు ప్రొఫైల్‌ను తగ్గించడానికి ఉద్దేశించబడింది. అగ్నివీర్స్ అని పిలువబడే ఈ వ్యక్తులు ప్రస్తుతం సర్వీస్‌లో మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు పెన్షన్ వంటి సాధారణ ప్రయోజనాలకు అర్హత పొందలేదు. ఈ సమస్య విస్తృత చర్చలకు దారితీసింది, విధి నిర్వహణలో మరణించిన అగ్నివీరుల కుటుంబాలకు సాధారణ సైనిక సిబ్బంది కుటుంబాలకు అందించే ప్రయోజనాలకు సమానమైన ప్రయోజనాలను పొందాలని పార్లమెంటరీ ప్యానెల్ గతంలో సిఫార్సు చేసింది.

### బెంగాల్‌ని విభజించేంత దమ్ముందా...

# బీజేపీకీ దీదీ స్ట్రాంగ్ వార్నింగ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌ను విభజించే అన్ని ప్రయత్నాలను తృణమూల్ కాంగ్రెస్ తిప్పికొడుతుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. బెంగాల్‌ను విభజించేందుకు వారిని రానివ్వండి.. ఎలా అడ్డుకోవాలో తనకు బాగా తెలుసని దీదీ పేర్కొన్నారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో పాల్గొన్న మమతా... బెంగాల్‌లోని రెండు జిల్లాలను, బిహార్, జార?ండ్‌లోని మరికొన్ని జిల్లాలను కలిపి కేంద్ర పాలిత ప్రాంతంగా చేయాలని, ఈశాన్యంలోని ఓ భాగాన్ని ఉత్తరబెంగాల్‌గా ఏర్పాటు చేయాలని జార్ఖండ్‌కు చెందిన బీజేపీ లోక్‌సభ సభ్యుడు నిషికాంత్ దూబే చేసిన డిమాండ్‌ను ముఖ్యమంత్రి మమత ఖండించారు. బెంగాల్‌ను విడదీయడానికి ఎవరైనా ప్రయత్నిస్తే తాను అడ్డుకుంటానని స్పష్టం చేశారు. ముర్షిదాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ శాసనసభ్యుడు గౌరీ శంకర్ ఘోష్ కూడా నిషికాంత్ దూబే డిమాండ్‌కు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో భారత్–బంగ్లాదేశ్ రివర్ కమిషన్‌కు అనుగుణంగా భారత్–భూటాన్ రివర్ కమిషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను ఆమె లేవనెత్తారు.




**ఎక్కువ సీట్లిచ్చినా అన్యాయమే..**

"ప్రధాని సమక్షంలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను లేవనెత్తాను. బెంగాల్ రాష్ట్రం ఆకారం పడవలా ఉన్నందున, రాష్ట్రంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉంటోంది. బంగ్లాదేశ్‌తో తీస్తా నీటిని పంచుకునే విషయంలో బీజేపీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోంది. వాటిని మేం అంగీకరించం. వరద విపత్తుల నిర్వహణకు కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు అందజేస్తోంది. పశ్చిమ బెంగాల్ ఏటా ఈ నిధులను కోల్పోతోంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి బెంగాల్‌లో మంచి ఫలితాలు వచ్చినప్పటికీ ఆ పార్టీ రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. బెంగాల్‌ను విభజించేందుకు ఎవరొస్తారో రానివ్వండి. దాన్ని ఎలా అడ్డుకోవాలో వారికి చూపుతాం" ఆమె దీదీ పేర్కొంది.

రాష్ట్రంలో భూమికోత నియంత్రణ, వరద నివారణ చర్యలపై తీర్మానం చేసిన సందర్భంగా ఈ విషయాన్ని ఆమె అసెంబ్లీలో ప్రస్తావించారు.

# ఢిల్లీ వరదల్లో హైదరాబాద్ యువతి మృతి

న్యూఢిల్లీ: ఢిల్లీ వరదల్లో నగరానికి చెందిన ఓ యువతి మృతిచెందింది. సికింద్రాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ కూతురు తానియా సోని(25) సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యేందుకు ఢిల్లీ, రాజిందర్‌నగర్‌లోని రావూస్ స్టడీ సర్కిల్‌లో చేరింది. అక్కడే ఉంటూ సివిల్స్ పరీక్షలకు సిద్ధం అవుతోంది. విజయ్‌కుమార్ మంచిర్యాల జిల్లాలోని శ్రీరాంపూర్‌లో సింగరేణిలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఢిల్లీలో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలతో ఢిల్లీ ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. అయితే భారీ వర్షాలకు ఢిల్లీ రాజిందర్‌నగర్‌లోని రావూస్ ఐఏఎస్ స్టడీ సెంటర్ సెల్లార్‌లోకి శనివారం రాత్రి వరదనీరు చేరింది. బేస్మెంట్‌లోని లైబ్రరీలో ముగ్గురు విద్యార్థులు చదువుకుంటుండగా ఒక్కసారిగా నీరు ముంచెత్తింది. దీంతో ఎటూ వెళ్లలేని స్థితిలో విద్యార్థులు తానియా సోని (25), శ్రేయా యాదవ్ (25), నెవిన్ డాల్విన్ (28) నీట మునిగి మృతిచెందారు. ఘటనపై సమాచారం అందుకున్న సహాయక సిబ్బంది హుటాహుటిన వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. 30 మంది విద్యార్థులను రక్షించారు. కానీ ముగ్గురు విద్యార్థులు మరణించారు.

# ఆ విషయంలో వెంకట్ రెడ్డి, రేవంత్ ముక్కు నేలకు రాసి రాజీనామా చేయాలి: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్: తనపై ఆరోపణలు నిరూపించకపోతే మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సిఎం రేవంత్ రెడ్డి ఇద్దరు ముక్కు నేలకు రాయడంతో పాటు రాజీనామా చేయాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు. తనపై ఆరోపణలు నిరూపించకపోతే సిఎం, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రాజకీయాల్లోంచి వెళ్లిపోవాలని సవాల్ విసిరారు. కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ఏ ఒక్కటి నిరూపించినా సభలో ముక్కు నేలకు రాసి రాజీనామా చేసి వెళ్లిపోవడంతో పాటు మళ్లీ రాజకీయాల్లోకి రాను అని జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. తనపైన ఒకటి కాదు మూడు హత్య కేసులు పెట్టారని, కాంగ్రెస్ పెట్టిన మూడు కేసుల్లో కోర్టులు తనని నిర్దోషిగా తేల్చాయని తెలియజేశారు. పెట్రోల్ బంక్‌లు, మిర్యాలగూడ కేసులు ఉన్నాయని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారని, వాళ్లు చెప్పిన కేసులపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తాను మాట్లాడితే సిఎం రేవంత్ రెడ్డి భుజాలు ఎందుకు తడుముకుంటున్నారని, మా నాయకుడు కెసిఆర్ హరిశ్చంద్రుడేనని, వాళ్లలా సంచులు మోసే చంద్రుడు కాదని జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. చంద్రుడి సంచులు మోసి జైలుకు వెళ్లింది రేవంత్ రెడ్డి అని చురకలంటించారు. విద్యుత్ అంశంలో అధికార పక్షం చేస్తున్న ఆరోపణలు సరైనవి కావన్నారు. కొత్తగూడెం విద్యుత్ ప్లాంట్ కూడా బిహెచ్ఎల్‌కే ఇచ్చామని, కోమటిరెడ్డి మాట్లాడిన ప్రతీ అక్షరం రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 'జగదీశ్వర్‌రెడ్డి సవాలు స్వీకరిస్తున్నా, నేను చేసిన ఆరోపణలు నిరూపించకపోతే మంత్రి, ఎంఎంఎల్ పదవులకు రాజీనామా చేస్తా' అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిసవాల్ విసిరారు.




# సభలో రేవంత్ తీరుపై హరీశ్ గరం గరం

హైదరాబాద్: శాసనసభలో తప్పుడు ప్రకటనలతో అసెంబ్లీని కాంగ్రెస్ తప్పుదోవపట్టిస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, "గవర్నమెంట్ డిఫెన్స్‌లో పడినప్పుడు ఏదొక పేపర్ పట్టుకుని సభలోకి వచ్చి డైవర్షన్ చేస్తున్నారు. సభా నాయకుడు సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. అదర్ దేన్ అగ్రికల్చర్ మీటర్స్ అనే పదాలను ఎగరగొట్టి చదివారు. అప్పులు 7 లక్షల కోట్లు అని తప్పుగా చెబుతున్నారు. ఇష్టం వచ్చినట్లు అప్పులు చేయలేదని చెప్పే ప్రయత్నం నేను చేస్తుండగా మోటర్లకు మీటర్లు పెట్టడానికి సంతకం చేశారని రేవంత్ లేచి సభను మిస్ లీడ్ చేశారు." అని హరీశ్‌రావు మండిపడ్డారు. "ఎల్‌ఆర్ఎస్ కోసం 25 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనీ... వాటిని క్లియర్ చేస్తే ఆదాయం వస్తుందని భట్టి చెబుతున్నారు. ఎల్‌ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హైకోర్టులో కేసు ఫైల్ చేశారు. ఎల్‌ఆర్ఎస్‌పై కేసు విరమించుకుని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి రెగ్యులరైజ్ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. రేవంత్ రెడ్డి.. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మెల్యే పదవికి కనీసం రాజీనామా కూడా చేయలేదు. నాడు కొంతమంది టీడీపీ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు రిజైన్ చేస్తూ జీరాక్స్ కాపీ ఇచ్చారు. రేవంత్ రెడ్డి కనీసం ఆ జిరాక్స్ కాపీ కూడా ఇవ్వలేదు." అని ఆరోపించారు.



"కేసీఆర్ ఆమరణ నిరహార దీక్ష చేయకుంటే సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చేదా?, 2001 నుంచి 2014 వరకు తెలంగాణ గురించి రేవంత్ ఏ రోజు మాట్లాడలేదు. కేసీఆర్ చేసినన్ని రాజీనామాలు తెలుగు రాష్ట్రాల్లో ఎవరు చేయలేదు. అమరవీరుల ఆత్మ త్యాగాలను చిన్నగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. 18 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఖాతా ఓపెన్ చేయలేదు. గత ఎన్నికల్లో పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదా కూడా రాలేదు. అంత మాత్రాన కాంగ్రెస్ పని అయిపోయిందని మేము ఆ రోజు అన్నామా!, ఇండియా కూటమి 28 పార్టీల కలయికతో ఆ సీట్లు వచ్చాయి. 28 పార్టీలతో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్‌కు 21 శాతం ఓట్లు వచ్చాయి. రేవంత్ పనితీరు బాగలేకపోవడంతోనే మహబూబ్‌నగర్ ఎంపీగా ఓడిపోయారు. ఆయన ఎంపీగా గెలిచిన మల్కాజిగిరి పార్లమెంట్‌లో కనీసం ఒక్క ఎమ్మెల్యే కూడా గెలవలేదు. రేవంత్ సొంత జిల్లాలో లోకల్ బాడి ఎమ్మెల్సీ స్థానం కూడా ఓడిపోయారు. 20 సీట్లు గెలిచినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 39 స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాలేదా?, చీమలు పెట్టిన పుట్టలో పాము దురినట్లు కాంగ్రెస్‌లో చేరి సీఎం అయ్యారు. అసలు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీహెచ్ లాంటి నేతలు ఏమయ్యారు?, జైపాల్ రెడ్డి కనీసం రేవంత్ రెడ్డిని దగ్గరకు కూడా రానివ్వలేదు." అని హరీశ్‌రావు చెప్పుకొచ్చారు.

# అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్

అమరావతి: విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ 'అకడమిక్ క్యాలెండర్'ను విడుదల చేశారు. రాజకీయాలకు అతీతంగా పాఠశాల విద్య అకడమిక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నాయకుల బొమ్మలు, పార్టీల రంగులు లేకుండా రూపకల్పన చేశారు. కాగా ఆగస్టులో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు మంత్రి లోకేశ్ ఆదేశాలు ఇచ్చారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పోస్టుల భర్తీకి మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విపక్ష వైసీపీపై మండిపడ్డారు. "అమరావతి: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మరోసారి వైఎస్సార్‌సీపీపై, ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌పై మండిపడ్డారు. అధికారం ఉన్నప్పుడు జగన్ ఇంత గగ్గోలు పెట్టలేదని, నేడు ఏం చేసైనా పోగొట్టుకున్న అధికారం పొందాలని అతిగా ఆవేశపడుతున్నాడని మండిపడ్డారు. 31 రాజకీయ హత్యలు అని అబద్ధాలు చెప్పడం అవగాహన లేని మాటలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 31 రాజకీయ హత్యలు ఎక్కడ జరిగాయో ధైర్యం ఉంటే పేర్లు చెప్పాలని ఆయన నిలదీశారు. జగన్ రెడ్డి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అవినీతి సంపాదన ఉందని ఢిల్లీకి ఎగేసుకుపోతారా? అని ప్రశ్నించారు. "జగన్ రెడ్డికి తప్పుడు పేరు పెట్టారు... వైఎస్ గ్లోబెల్స్ రెడ్డి" అని పేరు పెట్టి ఉండాల్సిందని పంచ్‌లు వేశారు. ఢిల్లీకి వెళ్లి ఏదో చేయాలని చూశాడని, కానీ అబాసు పాలయ్యాడని వర్ల రామయ్య మండిపడ్డారు. "జగన్ రెడ్డి ఒక పెద్ద అబద్ధాల కోరు. ఏ2 ఎక్కడ ఉన్నాడో తెలియదు.. సజ్జల ఎటు పోయాడో తెలియదు. మీ పాలనను గుర్తుచేసుకోండి. 11 కేసుల్లో ఛార్జ్ సీట్లు ఎదుర్కొంటున్న వ్యక్తి మీరు. రూ.43 వేల కోట్లు కొట్టాశారని సీబీఐ చెప్పింది. అందుకే 16 నెలలైనా బెయిల్ రాలేదు. నేటికీ ప్రతి శుక్రవారం కోర్టుకు వెళ్లాలి. అబద్దాలు చెప్పి కోర్టులను మభ్యపెట్టి మాయ చేసి కోర్టులకు వెళ్లకుండా ఎగ్గొట్టి నీతులు వల్లిస్తారా?. మీ కంటిలోని దూలాన్ని పెట్టుకుని ఎదుటి కంటిలోని నలుసు కోసం పాకులాడుతున్నారా?. అధికారం పోయి 50 రోజులు అయినా మీ మీద ఉన్న కేసులపై ఎందుకు కోర్టులకు హాజరు కావడంలేదు. 11 కేసుల్లో ఛార్జిషీట్లు ఎదుర్కొంటూ. కోట్ల రూపాయల ప్రజాధనం కొట్టేసిన మీకు మాట్లాడే నైతిక హక్కు లేదు. జగన్ రెడ్డి క్రమం తప్పకుండా కోర్టుకు వెళ్లాలి. కోర్టులో నిర్ధోషిత్వాన్ని నిరూపించుకోవాలి. సామాన్యులు విచారణకు రాకుండా ఉంటే చట్టం ఊరుకుంటుందా? అలాగే జగన్ రెడ్డి కేసులను న్యాయస్థానం సమీక్షించి చర్యలు తీసుకోవాలి" అని వర్ల రామయ్య అన్నారు.



# రిజర్వేషన్లపై నితీష్ సర్కార్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: రిజర్వేషన్ల అంశంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కు సుప్రీంకోర్టు లో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై పాట్నా హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు నిరాకరించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్ల కోటా పెంపును పాట్నా హైకోర్టు ఇంతకుముందే తోసిపుచ్చగా, దానిని బీహార్ సర్కార్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీనిపై సీజేఐ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం తాజాగా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. సమగ్ర విచారణ కోసం సెప్టెంబర్‌కు కేసును వాయిదా వేసింది. న్యాయమూర్తులు జేపీ పరిడివాలా, మనోజ్‌మూర్తి సుప్రీం ధర్మాసనంలో ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటాను 50 నుంచి 65 శాతానికి పెంచుతూ రెండు చట్టాలను బీహార్ అసెంబ్లీ 2023లో సవరించింది.

# పల్లెలన్ని జల్లెడ... మావోయిస్టు కదలికలపై నిఘా

వాజేడు: మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో ఏజెన్సీ పల్లెలన్నీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. మావోయిస్టు కదలికలపై ప్రత్యేకంగా పెట్టిన పోలీసులు మావోయిస్టు ప్రభావిత గ్రామాలలో వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగానే ములుగు జిల్లా వాజేడు మండలంలోని పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యావారిపేట గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించగా... అదేవిధంగా కడెకల్ గ్రామంలో కార్డెన్ చర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.... అపరిచిత, అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామ పరిసర్లలో కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా యువత గంజాయి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని చెడు వ్యసనాలకు బానిసై తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ జవాన్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## సంపాదకీయం

మంగళవారం, జూలై 30, 2024

# రైతు 'పంట' పండించిన బడ్జెట్..!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన తొలి బడ్జెట్‌లో రైతుకు, వ్యవసాయానికి పట్టం కట్టింది. కొత్త సంక్షేమ పథకాలు ఏవీ లేవని బడ్జెట్‌పై చర్చలో కేసీఆర్ విమర్శలు గుప్పించినప్పటికీ ఇది రైతు పంట పండించనున్న బడ్జెట్‌గా చెప్పాలి.వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు కేటాయించగా, రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లను అదనంగా కేటాయించారు. తొలిసారిగా రైతు కూలీలకు కూడా పట్టాలతో సంబంధం లేకుండా ఏడాదికి 12 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పడం ముదావహం. అలాగే రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లను కేటాయించి మంత్రి నివ్వెరపరిచారు. సంక్షేమానికి రూ.40 వేల కోట్లు కేటాయించారు. దీంతో అప్పుల చెల్లింపుతో పాటు ప్రజా ప్రయోజనాలకు కూడా భారీగా వ్యయం చేయనున్నట్లు రాష్ట్ర బడ్జెట్ పేర్కొంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మొత్తం బడ్జెట్ వాల్యూ 2,91,159 లక్షల కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం రూ.2,20,945 కోట్లు, మూలధనం వ్యయం రూ.33,487 కోట్లుగా ఉంది. ఈ క్రమంలో వ్యవసాయశాఖకు భారీగా రూ.72,659 కోట్లు, సంక్షేమానికి రూ.40 వేల కోట్లు, సాగునీటి రంగానికి రూ.26 వేల కోట్లు కేటాయించారు. ఇవే కాకుండా పంచాయతీరాజ్ శాఖకు రూ.29, 816 కోట్లు, విద్యాశాఖకు రూ.21,292 కోట్లు, వైద్యారోగ్య శాఖకు రూ.11, 468 కోట్లు. ఎస్టీ సంక్షేమానికి రూ.17,056 కోట్లు. ఎస్సీ సంక్షేమానికి రూ. 33,124 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.9200 కోట్లు, ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు, మొత్తం హైదరాబాద్ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు రూ.1500 కోట్లు కేటాయించారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మొత్తం రూ.72,659 కోట్లను రైతాంగానికి కేటాయించింది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలకు ఆ నిధులను వినియోగించనుంది. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటలు, ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రుణమాఫీ తొలివిడతలో లక్ష వరకు రుణాలు ఉన్న అన్నదాతల అకౌంట్లలో నగదు జమ చేసిన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15లోపు 2 లక్షల మేర రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. అలాగే తాము ఇస్తానన్న 15 వేల రైతు భరోసా పథకాన్ని అమలు చేసే విధంగా ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. ఈ పథకానికి మార్గదర్శకాలు ఎలా ఉండాలనేది ఈ బడ్జెట్ సమావేశాల్లోనే.. చర్చించి తుది నిర్ణయం తీసుకుని అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో చివరి రైతు వరకు సంక్షేమ ఫలాలు అందలనేదే సర్కార్ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత కరువై పని దొరకని రోజుల్లో రైతు కూలీలు పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టాలు ఉన్న రైతులకే భరోసా నిచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టాలు లేని పేద రైతులను గాలికొదిలేసింది. వారందరినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టబోతోంది. రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిచనున్నట్లు పేర్కొంది. ఈ పథకానికి కూడా ఈ సంవత్సరంలోనే శ్రీకారం చుట్టుబోతున్నట్లుగా మంత్రి ప్రకటించారు. అయితే దేశ చరిత్రలో భూమి లేని పేద రైతులకు నగదు పంపిణీ చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అప్పులు పది రెట్లు పెరిగాయి తప్ప తెలంగాణ ఆకాంక్షలు తీరలేదని బడ్జెట్ సమర్పణ సందర్భంగా ఆర్థికమంత్రి ప్రకటించారు. బంగారు తెలంగాణ చేస్తామని అప్పుల తెలంగాణను మిగిల్చారని ఆరోపించారు. కోట్లాది ప్రజల ఆశల మేరకు ఉద్యోగాలు, నీళ్లు దక్కకపోగా ఒంటెద్దు పోకడలతో ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అప్పుల పెరగడంతో పాటు బిల్లుల బకాయిలు భారీగా పెరిగాయని మంత్రి తెలిపారు. కొత్త ఉద్యోగాలు సృష్టించడానికి బదులు ఉన్న ఉద్యోగాలను కూడా ఇవ్వలేదని, జీతాలు పెన్షన్ చెల్లింపులు సైతం చేయలేని దుస్థితి ఏర్పడిందని ఆర్థిక మంత్రి తెలిపారు. ఈ పరిస్థితుల్లో పదేళ్ల తర్వాత వాస్తవిక బడ్జెట్ ప్రవేశపెట్టామని మంత్రి చెప్పుకొచ్చారు. అయితే ఆరు గ్యారెంటీల అమలు విషయంలోనే మల్లగుల్లాలు పడుతున్న ప్రభుత్వం వాటితోపాటు ప్రకటించిన భారీ స్థాయి నజరాలను ఎలా చెల్లిస్తుందనేదే అసలు సమస్య. కేంద్ర సహాయంపై ఆశలు కూడా ఆవిరవుతున్న వేళ.. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి బడ్జెట్ సాహసోపేతమైన ప్రకటన అనే చెప్పాల్సి ఉంటుంది. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆసరా పెన్షన్ల పెంపు, విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్ వంటి గుదిబండలను దాటుకుని రాష్ట్ర ప్రభుత్వం తన హామీలన్నింటినీ క్రమంగా నెరవేరుస్తుందని ఆశిద్దాం.

# రుణమాఫీ కానీ రైతులను గుర్తించి రుణమాఫీ చేయాలి

## - సిపిఐ నాయకుల డిమాండ్



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు రుణమాఫీ కాని రైతులతో సోమవారం గునుకుల కొండాపూర్ గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొదటిదాపగా ఒక లక్ష రూపాయలు మాఫీ ప్రకటించిన చాలామంది రైతులకు రుణమాఫీ కావడం లేదని. ఇట్టి విషయం లో వ్యవసాయ అధికారులను అడిగితే బ్యాంకర్లు మాకు సహకరించడం లేదని మాట్లాడుతున్నారని. బ్యాంక్ అధికార్ల తోటి మాట్లాడితే మేము పూర్తిస్థాయిలో వారికి సహకరిస్తున్నామని అన్నారని. ఇట్టి విషయంలో ఎవర్ని అడగాలో రైతులు అయోమయ పరిస్థితిలో ఇబ్బందులకు గురి అవుతున్నారని మండిపడ్డారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో ఇంకా అర్హులైన రైతులు చాలామంది ఉన్నారని వారిని గుర్తించడంలో వ్యవసాయ శాఖ అధికారులు విఫలమయ్యారని సిపిఐ నాయకులు మండిపడ్డారు . ఇట్టి విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు పేపర్ ప్రకటన చేయకపోవడం చాలా బాధాకరమని అన్నారు. అర్హులైన రుణమాఫీ కాని రైతులతో త్వరలో వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులైన వారిని వెంటనే గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి ,సహాయ కార్యదర్శి చోక్కల్ల శ్రీశైలం, మండల నాయకులు మొలుగూరి ఆంజనేయులు, రైతులు చోక్కల్ల శ్రీనివాస్, కున రవి, చోక్కల్ల పర్శరాములు, బుచ్చయ్య, కొమురయ్య, భాలయ్య, తది తరులు పాల్గొన్నారు.

# గంజాయి కట్టడికి కృషి చేద్దాం

## - భావితరాల భవిష్యత్తును కాపాడుదాం



**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** అత్యంత ప్రమాదకర మత్తు పదార్థం గంజాయి దానిని మన మండలంలో లేకుండా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల యువజన నాయకుడు ఎమ్ రాజు అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండలంలో గంజాయి ఉపయోగించే వారి సంఖ్య పెరిగిందని పోలీసులు అంటున్నారు. సమాజంలో ఒక వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఎప్పటికప్పుడూ వారిలో వస్తున్న మార్పులను గమనిస్తూ ప్రాథమిక స్థాయిలో గుర్తించినట్లతే వాటి బారి నుంచి వారిని కాపాడ వచ్చున్నారు. ప్రస్తుత రోజుల్లో అన్ని ప్రాంతాల్లో మత్తు పదార్థాల వినియోగం అధికంగా కావడంలో నేడు ఇది సామాజిక సమస్యగా పరిగణించబడుతోంది. ఇలాంటి సామాజిక సమస్యను రూపుమాపడంతో అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావల్సి వుంటుందని. ఇందులో భాగంగా ఎవరైన గంజాయి లేదా మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలకు పాల్పడినట్లుగా ఎవరిలోనైనా గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు, సమాచారం అంధించిన వారి వివరాలు గోప్యంగా. ఉంచబడతాయని, కావున గంజాయి రహిత ప్రాంతంగా గుర్తింపబడటంలో ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అన్నారు.

# విద్యార్థి ఆటో చార్జీలకై 20వేల రూపాయల ఆర్థిక సహాయం



**తెలంగాణా క్యాపిటల్ న్యూస్ ఇల్లంతకుంట:** మండలంలోని రహీంఖాన్ పేట ఆదర్శ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ బిగుల్ల బాబు తమ పాఠశాలలో ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన ఉప్పులేటి సిద్ధార్థ యొక్క నాలుగు సంవత్సరాల ఆటో చార్జీల బకాయిలు 20వేల రూపాయలను ఆటోడ్రైవర్లు గొడుగు తిరుపతి మరియు అంజయ్య లకు అందజేశారు.వంతడుపుల గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని విద్యార్థి సిద్ధార్థ తమ పాఠశాలలో చేరినప్పుడు డ్రైవర్ చింతకింది రవితో పాటు ఆటో యూనియన్ సభ్యులు మరియు ఇతర దాతల సహాయంతో ఆరవ తరగతి పూర్తి చేశాడు.తదుపరి డ్రైవర్లు మరియు సిద్ధార్థ తాతయ్య కామ రాజయ్య విరాళాల కోసం డాక్టర్ బాబు ను సంప్రదించగా వారి విజ్ఞప్తి మేరకు ఏడు నుండి పదవ తరగతి పూర్తయ్యే వరకు అన్ని రకాల నోట్స్ పుస్తకాలు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. విద్యార్థి యొక్క ఆటో చార్జీలు తానే భరిస్తానని, ఇచ్చిన మాట ప్రకారం నేడు 20వేల రూపాయల బకాయిలను చెల్లించారు. తక్కువ ఛార్జీలు తీసుకున్నందుకుగాను డ్రైవర్ గొడుగు తిరుపతికి బాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిగుల్ల బాబును ఆటో డ్రైవర్లు గొడుగు తిరుపతి, బొప్ప రాములు, రవి, మహేష్, నరేష్, రంజిత్, బాలయ్య మరియు తెలంగాణ శ్రీనివాస్ తదితరులు పలుపొన్నారు.

# శాటిలైట్ టోల్ వసూళ్లు..ఎలా పనిచేస్తాయి

**హైదరాబాద్:** హైవేలపై ప్రయాణించాలంటే కచ్చితంగా టోల్ చెల్లించాల్సిందే. ఇందుకోసం లైన్‌లో వెయిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఒకప్పుడు డబ్బులు చెల్లించే విధానం నుంచి నేడు ఫాస్ట్‌ట్రాక్‌కి అప్‌గ్రేడ్ అవుతూ వచ్చాము. అయితే ఇకపై అసలు టోల్ ప్లాజాలే ఉండవు. అదేంటి టోల్ ప్లాజాలు లేకపోతే టోల్ ఎలా వసూలు చేస్తారనే సందేహం కచ్చితంగా వస్తుంది కదూ! దేశంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు వ్యవస్థను తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. అసలు ఎలాంటి టోల్ ప్లాజాలు లేకుండానే వాహనదారుల బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు టోల్ రూపంలో కట్ అవుతాయిత్వరలోనే దేశంలోని అన్ని టోల్ ప్లాజాలను మూసివేయనున్నట్లు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ స్థానంలో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని అమలు చేయబోతున్నట్లు తెలిపారు. ఇంతకీ శాటిలైట్ బేస్డ్ టోల్ కలెక్షన్ సిస్టమ్ అంటే ఏంటి.? అసలు ఇది ఎలా పనిచేస్తుంది.? ఈ విధానంలో డబ్బులు ఎలా కట్ అవుతాయో ఇప్పుడు తెలుసుకుందాం..ప్రస్తుతం టోల్ చెల్లించాలంటే వాహనదారులు టోల్ ప్లాజాల వద్ద వాహనాలు నిలిపి లైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఉంది.

# విద్య వైద్యం ఉపాధి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

## - ఎన్నికల ముందు ఒక మాట గెలిచిన తర్వాత మరో మాట

**మక్తల్ జూలై 29:**




విద్య వైద్యం ఉపాధి రంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్య వహించిందని డీఎస్పీ జిల్లా నాయకులు అడ్వకేట్ దశరథ్ కుమార్ సోమవారం మక్తల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద ప్రజలు ప్రజలకు ఉపయోగపడే విద్య వైద్యం ఆరోగ్యంపై బడ్జెట్ కేటాయించడంలో నిర్లక్ష్యం చేయాడం సరికాదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఓట్ల రాజకీయం చేసి గద్దె ఎక్కిన తర్వాత బీసీ,ఎస్సీ,ఎస్టీ ప్రజలతో చెలగాటమాడం సరికాదని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబంలో ఉన్న పేదలకు విద్య ఆరోగ్యపట్ల ఎన్నో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఎందుకు బడ్జెట్ కేటాయింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారో అని కనీసం ప్రభుత్వ మాసుపత్రిలో వర్షాకాలం సీజన్లో రైతులు ఎక్కువ పొలాల్లో ఉంటారు కాబట్టి పాము కరిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వెళ్తే పాము కాటుకు మందు లేదు ఇది పరిస్థితి మండిపడ్డారు. గ్రామీణ నియోజవర్గ మండల స్థాయిలో ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్లో కనీసం సౌకర్యాలు లేవు సక్రమంగా బడ్జెట్ కేటాయింపులు చెయ్యలేదు అసలు విద్యకు బడ్జెట్ ఏ పూర్తిస్థాయిలో కేటాయించలేదు స్వయాన ఉపాధ్యాయుల రోడ్ ఎక్కి ధర్నా చేస్తున్న పరిస్థితి నేడు తెలంగాణలో పేర్కొంది అన్నారు ఇదే తరహాలో ప్రభుత్వం కొనసాగిస్తే త్వరలో భారీ ఎత్తున ఉద్యమం ఉంటుంది అని డిఎస్పి నాయకులు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాయకులు గువ్వలి శివరాజ్ కర్నే బాలరాజ్ డేవిడ్ గోపాలకృష్ణ వేణు సమస్త పురం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నవచరిత్రను సృష్టించిన నికోలస్ మదురో

హ్యూగో చావెజ్ రాజకీయ వారసుడు, వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో 51 % ఓట్లతో వరుసగా మూడవసారి గెలుపొంది నవచరిత్రను సృష్టించడం హర్షణీయం అనిరీసెర్చ్ స్కాలర్‌జె.జె.సి.పి. బాబూరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెనిజులాలో గత 25 ఏళ్ళుగా కొనసాగుతున్న సోషలిస్ట్ పాలనను ప్రజలు కొనసాగించాలి అని కోరుకోవడాన్ని చాలా స్పష్టంగా గమనించవచ్చు అని ఆయన వెల్లడించారు. ఏది ఏమైననూ అమెరికా కుట్రాజకీయాలతో మిలాఖత్ కాబడి అనేక అడ్డంకులు సృష్టించిననూ ప్రజలు వాటన్నింటిని నిలువరించి మూడోసారి కూడా నికోలస్ మదురోని ఎన్నుకోవడం వెనిజులా రాజకీయాలలో చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించింది అని నిస్సందేహంగా చెప్పవచ్చు అని ఆయన పేర్కొన్నారు.



# రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన కలిగిస్తున్న ఎస్సై హరిప్రసాద్ రెడ్డి



**పెబ్బేర్ జులై 29:**

పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, చట్టాలు వాటి ఆవశ్యకత ఎన్ హెచ్ 44 రోడ్డు పై గ్రామం కావున తగు జాగ్రత్తలు పాటించి రోడ్డుపై వాహనాలు డ్రైవింగ్ చేయాలని, చిన్న చిన్న తగాదాలకు క్షణికావేశానికి లోనై కొట్లాటలకు దూరంగా ఉండాలని అదేవిధంగా సైబర్ నేరాలు వాటిపై అవగాహనతో ఎలా ఉండాలి సెల్ ఫోన్లో ఎలా ప్రవర్తించాలి ఎవరికి సమాచారం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు గౌడ్ పోలీస్ సిబ్బంది మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, రామన్ గౌడు, రంగన్న యాదవ్ ,ఉమేష్ గౌడ్, రాములు గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు

# మృతదేహానికి నివాళ్లు అర్పించిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**పెబ్బేరు (జులై 29):**

పెబ్బేరు పట్టణ కేంద్రానికి చెందిన పూల వ్యాపారస్తుడు నజీర్ అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. ఇట్టి విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి మృత దేహానికి పూలమాల నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి ముస్తాక్ సహదేవ్ విజయవాడదన్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# ఆషికా రంగనాథ్: డెనిమ్ దివా అలర్ట్!



ప్రతిభావంతులైన నటి ఆషికా రంగనాథ్‌కు సాధారణం చిక్‌ని అప్రయత్నంగా ఎలా నెయిల్ చేయాలో తెలుసు. ఈ నటి ఇటీవల క్లాసిక్ బ్లూ డెనిమ్ ప్యాంట్‌తో జత చేసిన తెల్లటి స్లీవ్‌లెస్ క్రాప్ టాప్‌లో పూర్తిగా అద్భుతంగా కనిపించింది. ఈ సరళమైన ఇంకా స్టైలిష్ సమిష్టి ఆమె టోన్డ్ ఫిగర్ మరియు అప్రయత్నమైన ఆకర్షణను ఖచ్చితంగా హైలైట్ చేసింది. ఆషికా తన రూపాన్ని కొద్దిపాటి ఆభరణాలతో యాక్సెసరైజ్ చేసింది, ఆమె దుస్తులను ప్రధాన దశకు తీసుకువెళ్లింది. ఆమె జుట్టును మృదువైన అలలతో స్టైల్ చేయడం మరియు ఆమె మేకప్ సహజంగా ఉంచడంతో, ఆషికా తాజాగా మరియు ప్రకాశవంతంగా కనిపించింది. ఆమె సాధారణ మరియు స్టైలిష్ ప్రదర్శన నిస్సందేహంగా ఫ్యాషన్ ప్రియులకు కొత్త ట్రెండ్‌ని సెట్ చేసింది. ఆశికా రంగనాథ్ నిజమైన ఫ్యాషన్ ఐకాన్ అని ఖచ్చితంగా చెప్పవచ్చు, ఆమెకు ఆత్మవిశ్వాసంతో ఎలాంటి రూపాన్ని ఎలా మార్చాలో తెలుసు.

# అప్పుడే కథపై నమ్మకం కుదిరింది

## మ్యూజిక్‌షాప్ మూర్తి సక్సెస్ మీట్‌లో చాందినీ చౌదరి



అజయ్ ఘోష్, చాందిని చౌదరి కాంబోలో వచ్చిన మూవీ మ్యూజిక్ షాప్ మూర్తి. శివ పాలడుగు దర్శకత్వం వహించాడు. ఈ చిత్రంలో ఆమని, అమిత్ శర్మ, భాను చందర్, దయానంద్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. ఈ నేపథ్యంలో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ ఏర్పాటు చేసింది. సినిమా ప్రతీ ఒక్కరి జీవితాన్ని ప్రతిబింబిస్తుందని ఈ సందర్భంగా అజయ్ ఘోష్ అన్నారు. సినిమాకు మద్దతుగా నిలిచిన ప్రేక్షకులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. మొదట్లోనే ఈ సినిమా కథపై తనకు నమ్మకం కుదిరిందని చాందినీ చౌదరి చెప్పింది. ఇప్పుడు ఓటీటీలో కూడా మంచి స్పందన వస్తోంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు సినిమా కనెక్ట్ అవ్వాలని ఆతృతగా ఎదురుచూశాం. అనుకున్నట్టుగానే జరిగింది. సోషల్ మీడియాలో సినిమా గురించి నడిచిన చర్చ ఎంగేజింగ్‌గా ఉండటంతో సినిమాపై క్యూరియాసిటీ పెరిగింది. ఈ సినిమా కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేకించి డైరెక్టర్ శివకు ధన్యవాదాలు. ఈ సినిమా త్వరలోనే ఇతర భాషల్లో కూడా అందుబాటుకి వస్తుందని చెప్పుకొచ్చింది చాందినీ చౌదరి. ఇది నాకు మొదటి సినిమా. మ్యూజిక్ షాప్ మూర్తి తెరకెక్కించిన తర్వాత సినిమాలను ఎలా తీయాలి.. ఎలాంటి సవాళ్లు ఎదుర్కోవాలనే అంశాలపై పూర్తి స్పష్టత వచ్చిందని డైరెక్టర్ శివ అన్నాడు.

# లైఫ్ బాయ్ సుందరి సెగలు

‘బంటీ నీ సబ్బు స్లోనా ఏంటి?’ అంటూ లైఫ్ బాయ్ హ్యాండ్ వాష్ యాడ్ లో కనిపించిన చిన్నారి గుర్తుందా? అప్పుడు తన క్యూట్ క్యూట్ మాటలతో అలరించిన చిన్నారి.. ఇప్పుడు హీరోయిన్ గా మారిపోయింది. బాలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తోంది అవనీత్ కౌర్. పలు సీరియల్స్ లో యాక్ట్ చేస్తూ మెప్పిస్తోంది. వివిధ షోల్లో పార్టిసిపేట్ చేసి ఓ రేంజ్ లో ఆకట్టుకుంటోంది. తన డ్యాన్స్ పెర్ఫార్మెన్సులతో అదరగొడుతోంది. అయితే సోషల్ మీడియాలో కూడా ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది అవనీత్ కౌర్. గ్లామరస్ పిక్స్ తో కుర్రాళ్లను ఫిదా చేస్తుంటోంది. వేరే లెవల్ లో స్కిన్ షో చేస్తూ ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు వెకేషన్స్ కు వెళ్తూ అక్కడి పిక్స్ షేర్ చేస్తుంటోంది. పొట్టి పొట్టి బట్టల్లో ఫోటోలు దిగుతూ సెగలు రేపుతుంటోంది. తన గ్లామర్ షోకు హద్దులే లేవన్నట్లు పోజులు ఇస్తుంటోంది. తాజాగా కొత్త పిక్స్ షేర్ చేసింది బ్యూటీ అవనీత్ కౌర్. స్విమ్మింగ్ చేస్తూ ఎంజాయ్ చేస్తోంది. అందుకు సంబంధించిన పిక్స్ అండ్ వీడియోస్ ను షేర్ చేసింది. బ్లూ అండ్ వైట్ స్విమ్ డ్రెస్ వేసుకున్న బ్యూటీ.. ఓ రేంజ్ లో స్కిన్ షో చేస్తోంది. హాయిగా సేదతీరుతూ వయ్యారాలు ఒలకబోస్తోంది. స్విమ్మింగ్ చేస్తూ హొయలు ఒలకిస్తోంది. థైస్ షోతో క్లీన్ బౌల్డ్ చేస్తోంది. తన ఎద అందాలతో కవ్విస్తోంది. స్టన్నింగ్ లుక్స్ తో మైండ్ బ్లాక్ చేస్తోంది అమ్మడు. అవనీత్ కౌర్ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# చికిత్స కోసం యూఎస్‌కు షారుఖ్‌ఖాన్..!



బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్‌ఖాన్ యూఎస్‌కు వెళ్లనున్నాడన్న వార్త ఒకటి బీటౌన్‌లో రౌండప్ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం కంటి నొప్పి కారణంగా డాక్టర్లను సంప్రదించాడు షారుఖ్‌ఖాన్. అయితే అత్యవసర చికిత్స కోసం యూఎస్ వెళ్లాలని డాక్టర్లు సూచించారు. ఈ నేపథ్యంలో షారుఖ్‌ఖాన్ ఇవాళ రాత్రి కానీ లేదా రేపు యూఎస్‌కు పయనం కానున్నాడట. షారుఖ్ ఖాన్ వెంట సతీమణి గౌరీఖాన్, కుమారుడు ఆర్యన్ ఖాన్ కూడా యూఎస్‌కు వెళ్లనున్నట్టు తెలుస్తోంది. ఎవరూ ఊహించని విధంగా షారుఖ్‌ఖాన్‌కు అత్యవసర చికిత్స అని వార్తలు రావడంతో ఆందోళనకు లోనవుతున్నారు అభిమానులు. బాద్‌షా కంటి బాధ నుంచి త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నారు. ఈ ఏడాది కోల్‌కతాలో ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా షారుఖ్‌ఖాన్ వడదెబ్బకు లోనైన విషయం తెలిసిందే.

## సూపర్ స్టైలిష్ రాజాసాబ్‌గా ప్రభాస్ ఎంట్రీ..

# మారుతి గ్లింప్స్ అదిరిందంతే..!

గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి చాలా కాలం తర్వాత వస్తోన్న కామెడీ ఎంటర్‌టైనర్ రాజాసాబ్. మారుతి డైరెక్షన్‌లో వస్తోన్న ఈ చిత్రం హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోంది. మలయాళ భామ మాళవికా మోహనన్, ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. కాగా ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రాజాసాబ్ గ్లింప్స్ షేర్ చేసింది మారుతి టీం. ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతున్న విజువల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ స్టార్ ప్రభాస్‌ను చాలా రోజుల తర్వాత సూపర్ కూల్ అండ్ స్టైలిష్ అవతార్‌లో చూసి సంబరాలు చేసుకుంటున్నారు అభిమానులు, మూవీ లవర్స్.మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన రాజాసాబ్ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. సంజయ్ దత్ ఈ చిత్రంలో ప్రభాస్ తాతగా కనిపించబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. రిద్ధి కుమార్ కీలక పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రాజాసాబ్‌ను 2025 సంక్రాంతి సీజన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తుండగా.... దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

